# చి ట్టి

[గ ల్పి క]

కాంతం కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తున్నది, ఏడవ గలుగుతున్నది—అదృష్టవంతురాలు. కాంతం ఏడుపు తన గుండెల్లో నగారావాయింపు. ఆ ఏడుపు చెవులపడుతుంటే తనకు భయమేస్తున్నదనీ, చిట్టినిగురించి ఆలోచించటానికి తోచటంలేదనీ కాంతం తెలుసుకోదు. కాంతంతల్లి, దురదృష్ట వంతురాలు. దానిబాధ, తనకు తెలీదు. తనకు భయమేస్తున్నది గాని ఏడుపురావటంలేదు. తనగుండె అడుగునచిల్లిపడి అశ్రు వులన్నీ ఎటోకారిపోయినై. చిట్టినిచూచి అస్తమానమూ నవ్విన తనూ కాంతమూ ఈవిధంగా ఏడవటమేమిటి?... ఎక్కడో పొరపాటుజరిగింది. దేవుడింకా తెలుసుకోలేదు...

కాంతం సమీపానికి వెళ్లటానికి తనకు ధైర్యంలేదు. కాంతం చిట్టికోసం ఏడవకుండాఉంటే ఎంతబాగుండును! ఏడిచి చిట్టిచావు నిజంచేస్తున్నది కాంతం...

"అమ్మా, నాకళ్లకి నిద్దరొస్తుందే!" అనేదిచిట్టి. అది జ్ఞాపకంవచ్చి తనకేడుపురావటం దేనికీ? అప్పుడుతనునవ్వాలా? "నీకెక్కడ ఆకలవుతుందే, చిట్టితల్లీ?" అని అడిగితే చిట్టి వాళ్లమ్మతో, "నోట్లోనే!" అనేదిగట్టిగా—కాంతం చెవిటి దైనట్టు! చిట్టికి నోట్లో ఆకలవేది, చిట్టి కళ్లకినిద్దరొచ్చేది! అవన్నీ జ్ఞాపకం తెచ్చుకుంటే కాంతం ఏడవదు. అట్లా ఏడు స్తుంటే కాంతంతో ఇవన్నీ మాట్లాడటం ఎట్లా?

మొగుడుచచ్చిపోతే పెళ్లాం లాగా కాంతం ఇంకో మని

పయిపోతుంది. ఇకముందు కాంతం చిట్టికి అమ్మ అనేమాట ఉండదు. చిట్టికి అమ్మకాని కాంతంతో తను ఎట్లామాట్లాట్టం? ఏడవకుండాఉంటే కాంతం మారేదికాదేమో! తనుమాత్రం బతికిఉన్నంతకాలమూ చిట్టితండ్రిగానే ఉండిపోవాలి. అది అసాధ్యంకాదు. చిట్టినితల్చుకుని తాను ఎప్పటల్లే నవ్వగల గాలి. ప్రయత్నిస్తే సాధ్యమవుతుంది...

అద్దంలో చూసుకుంటే తనమొహమంతా వికారంగా ఉన్నది. అయ్యయ్యో! ఈమొహం చిట్టి ఎల్లా పోల్చుకుంటుంది? తనుకూడా మారితేయెట్లా? తనకి కాంతం కొత్తదై పోయినట్టు, తను కాంతానికూడా కొత్తవాడైపోతే ఎట్లా?...

కాంతం తనదుఃఖమంతా ఖర్చుచేసేసుకుంటున్నది. దుఃఖమంతా అయిపోయి మళ్లామామూలు మనిషిఅయి కాంతం ఇతరవిషయాలు మాట్లాడేప్పుడు తనకెట్లాఉంటుంది? చిట్టిని మరిచిన కాంతంతో తను కాపరంచెయ్యటం ఎట్లా?...

చిత్రం! మనిషికి జబ్బుచేస్తే మొదటి ప్రయత్నంలోనే నయంచెయ్యాలి. ఒకసారి విఫలమై రెండోసారి విజయం పొందటం అంటూఉండదు. చిట్టికిచేసినజబ్బు ఆటేప్రమాదకరమయిందికాదు. చివరిదాకా డాక్టరామాటే అంటూ వచ్చాడు. తనకు తట్టలేదుగాని చిట్టిజబ్బు నయంచేసేమందు ఆయుర్వేదంలో తప్పకుండాఉంటుంది. హోమియోపతీలో కూడా! ఇటువంటిజబ్బే ఆయనెవరో ఏపిస్‌తోనయంచేశాట్ట. చిట్టికి ఏపిస్ వేస్తేసరి! షాపులో పేటెంటుమందులునై—

విటామను బీ ఉన్నటువంటివి!...

"ఏమండీ, పాపం, మీపిల్ల పోయిందిటగా? హరి హరీ! ఎంత చలాకీపిల్లండీ! పోయివస్తాను. ఈబస్సుకు మాచారం పోతున్నాను! ఈరైతులేం చంపుకు తింటున్నారండీ—కాకపోయినా!" ఆయన అంతలోనే చిట్టివిషయం మరిచి పోయినాడు!...

కాంతంఏడుపు వినిపించటంలేదు. పాపం, ఏడిచి ఏడిచి అలిసిపోయిందేమో! లేదు, లేదు, నిశ్శబ్దంగా ఏడుస్తున్నది. పాపం, కాంతం! తనకేసి ఎంతచిత్రంగా చూసింది! చిట్టి జబ్బు నయం కానందుకు కాంతం తనని క్షమించలేదు. ఇక చిట్టినిగురించి తను ఎవరితో మాట్లాడతాడు?...

చిట్టికీ తనకూ ఇరవైరెండేళ్లు తేడా. ఈ తేడా క్షణక్షణమూ జాస్తి అవుతున్నదిగామాలు! ఇంకాపాతికేళ్లుపోయినా చిట్టి మూడేళ్లదేగా! తనకో? తనకి యాభై అవుతై! అప్పుడు తను చిట్టికి తాతయ్యల్లే ఉంటాడుగామాలు!...

నిశ్శబ్దంగా ఏడుస్తుండే కాంతాన్నిచూసి తనగుండె కరగి పోతున్నది. నిజానికి ఈ కాంతం వెనకటి కాంతం కన్నా ఒకవిధంగా ఎంతమంచిది! ఈకాంతం ఇంకోరిపిల్లల్నిచూసి అసూయపడలేదు; చిన్నచిన్న విషయాలనుగురించి మనస్సు క్షోభపెట్టుకోలేదు. చిట్టి ఈవిధంగా తల్లికొక కొత్త ఆధ్యాత్మిక శక్తి నిచ్చిందిగామాలు!...

రెండుయుగాలు—లేక రోజులా?—గడిచిన తరువాత ఈమధ్యాన్నం కాంతంమారినకంఠంతో తననుపలకరించింది.

"లేవండి, పోయిస్నానంచెయ్యండి—నాలుగు మెతుకులు

నోట్లో వేసుకుందురుగాని ”

“కాంతం!”

కాంతం దగ్గరకువచ్చి బుజాలమీద చేతులుపెట్టి, తన మెడ మీద మొహంపెట్టి నిశ్శబ్దంగా ఏడవసాగింది. తనకిక ఏడు పాగలేదు. తనూ కాంతమూ కలిసి ఏడవటానికిప్పు డవకాశం దొరికిందా? తన కన్నీళ్లు ఇంతకాలమూ పైకిరాంది ఇందుకా? ఇదివరకు కాంతం ఏడుపు స్వార్థంవల్లనే బాగుండలేదా? ఇద్దరూకలసి సమంగా కన్నీరు కార్చటం ఎంతబాగుంది!...

కామంతో కాంతాన్ని కావిలించుకోవటం మాత్రమే తా నెరుగును. ఇట్లా దుఃఖంతో కావిలించుకోవటం ఎరగడు!...